




ఒపి కౌంటర్‌ను ప్రారంభిస్తున్న ప్రభాకర్‌రెడ్డి

మెరుగైన వైద్య సేవలందించాలి

- ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్‌కు సిపిఎం వినతి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేట్

రాయలసీమకే తలమానికంగా ఉన్న కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ప్రజలకు మెరుగైన వైద్య సౌకర్యాలు అందించాలని సిపిఎం జిల్లా కమిటీ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభాకర్ రెడ్డికి వినతి పత్రాన్ని అందజేశారు. కొత్తగా బాధ్యత తీసుకున్న డాక్టర్ ప్రభాకర్ రెడ్డికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె.ప్రభాకర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్, కార్యదర్శి వర్గ సభ్యులు పిఎస్.రాధాకృష్ణ, కెవి.నారాయణ, నగర కార్యదర్శి ఎం.రాజశేఖర్ కలిసి వినతిపత్రం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు సూపరింటెండెంట్‌తో మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యశాలలో క్యాజువాల్టీలో బెడ్ల సంఖ్య పెంచాలని, అదనపు గదులను కేటాయించాలన్నారు. క్యాజువాలిటీలో స్ట్రెక్చర్ల సంఖ్యను పెంచాలన్నారు. ప్రతి బ్లాక్‌లో పాడైపోయిన మరుగుదొడ్లను మరమ్మతులు చేయించాలని కోరారు. చాలాచోట్ల మరమ్మతుల పనులు నత్తనడకగా నడుస్తున్నాయని వాటిని త్వరగా పూర్తి చేయాలని సూచించారు. క్యాన్సర్ హాస్పిటల్‌లో కొత్త పరికరాలను పెట్టి మెరుగైన వైద్యానికి కృషి చేయాలని డిమాండ్ చేశారు. వార్డుబాయ్‌ల సంఖ్యను పెంచాలని కోరారు. ఆసుపత్రిలో పనిచేస్తున్న సెక్యూరిటీ గార్డులు, స్వీపర్లకు ఒప్పందం ప్రకారం జీతాలు ఇవ్వాలని, పిఎఫ్, ఇఎస్ఐ నిధులను కార్మికుల ఖాతాలో జమ చేయాలని, ఆ రకంగా కాంట్రాక్టర్లకు ఆదేశాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

2వ ఈ-డిజిటల్ ఒపి కౌంటర్ ప్రారంభం

- ఒపి కౌంటర్ దగ్గర పేషంట్ల రద్దీ తగ్గుదల

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఓపి కోసం ఆసుపత్రికి వచ్చే నలుమూలల పేషెంట్స్ రద్దీ దృష్ట్యా అదనంగా మరో ఈ-డిజిటల్ ఓపి కౌంటర్‌ను మంగళవారం ఆస్పత్రి సూపరిన్‌టెన్‌డెంట్ డాక్టర్ సి ప్రభాకర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రిలోని ఈ డిజిటల్ ఒపి రెండవ కౌంటర్ పెట్టడం ద్వారా మంగళవారం 2400 మంది ఔట్ పేషెంట్లు ఆసుపత్రికి వచ్చినట్లు తెలిపారు. అందులో 2200 మందికి ఉదయం 10.30లోపు ఓపి ఇవ్వడం వలన రద్దీ పూర్తిస్థాయిలో తగ్గిందని తెలిపారు. ఈ డిజిటల్ ఓపి కౌంటర్ సక్సెస్ కావడానికి ఫార్మసీ విద్యార్థులు, నర్సింగ్ సిబ్బంది సేవలు బాగా ఉపయోగపడినట్లు తెలిపారు. ఆస్పత్రిలో ఎవరైనా స్వచ్ఛందంగా ఎన్ఎస్ఎస్ తరపున ఇంజనీరింగ్ కాలేజ్ , ఫార్మసీ కాలేజ్ విద్యార్థులు ఉదయం రోగికి సహాయం కోసం ఎవరైనా ఇంట్రెస్ట్ ఉన్నవాళ్లు స్వచ్ఛందంగా రావాలని వారికి సూచించారు. ఆస్పత్రిలో దీని ద్వారా ప్రజలకు అవగాహన కలుగుతుందని, అనంతరం వాళ్లకు కూడా సేవా భావం కలుగుతుందని తెలిపారు. ఆసుపత్రిలో త్వరలో స్త్రీల కోసం అదనంగా మరో రెండు ఓపి కౌంటర్లను ప్రారంభించనున్నట్లు డాక్టర్ ప్రభాకర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్యశ్రీ కో ఆర్డినేటర్, ఎఆర్ఎంఒ డాక్టర్ వెంకటరమణ, హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్, డాక్టర్ శివబాల నగాంజన్, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

సిఎం ప్రమాణ స్వీకారం వీక్షణకు ఏర్పాట్లు

- కలెక్టర్ డాక్టర్ సృజన

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్

రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు బుధవారం ప్రమాణ స్వీకారం చేయనున్న సందర్భంగా జిల్లా, నియోజకవర్గ కేంద్రాల్లో ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారోత్సవాన్ని వీక్షణకు ఏర్పాట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన పేర్కొన్నారు. జిల్లాలో ప్రత్యక్ష ప్రసారం ద్వారా ప్రజలు వీక్షించేందుకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. బుధవారం ఉదయం 10.00 గంటల నుంచి ఈ ప్రత్యక్ష ప్రసార కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు ఉదయం 11.27 నిమిషాలకు ప్రమాణస్వీకారం చేయనున్నారు. దీన్ని ప్రత్యక్షంగా తిలకించేందుకు జిల్లా కేంద్రంలో, అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో ఏర్పాట్లు చేశామన్నారు. జిల్లా కేంద్రంలోని సునయన ఆడిటోరియంలో, పత్తికొండ, మంత్రాలయం, కోడుమూరు, ఆలూరు ఎంపిడిఒ కార్యాలయాలలో, ఆదోని, ఎమ్మిగనూరు మున్సిపల్ కార్యాలయాలలో ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం ఏర్పాటు చేశామన్నారు. ప్రజలు, అధికారులు ఈ కార్యక్రమాన్ని వీక్షించాలన్నారు.

అంటువ్యాధుల పట్ల అప్రమత్తత అవసరం

- మలేరియా వ్యతిరేక మాసోత్సవం పై ర్యాలీ
- వైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్ కుమార్

ప్రజాశక్తి-తుగ్గలి

మండల కేంద్రమైన తుగ్గలిలో మంగళవారం వైద్య ఆరోగ్యశాఖ అధికారులు మలేరియా వ్యతిరేక మాసోత్సవంపై ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని వైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్ కుమార్ ప్రారంభించారు. అనంతరం ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో ఆశా కార్యకర్తలతో ఆశా డే సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో వైద్య అధికారి డాక్టర్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ ఈనెల 1వ తేదీ నుండి 30 వరకు అన్ని గ్రామాలలో మలేరియా వ్యతిరేక మాసోత్సవం కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభమైందని, అంటూ వ్యాధులు ప్రజలకు సోకకుండా ఈ వ్యాధుల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. గర్భవతులను క్రమ పద్ధతిలో ఆసుపత్రికి తీసుకువచ్చి వారికి వైద్య పరీక్షలు చేయించే బాధ్యత ఆశా కార్యకర్తలు తీసుకోవాలన్నారు. గర్భవతులు రక్తహీనతకు గురికాకుండా ఉండే విధంగా చూడాలన్నారు. కాన్పు సమయంలో తప్పనిసరిగా ప్రభుత్వ ఆసుపత్రులలో కాన్పు అయ్యేవిధంగా చూడాలని ఆయన ఆశా కార్యకర్తలకు సూచించారు. గర్భవతులు కాన్పు అయ్యే వరకు తమ సొంత కుటుంబ సభ్యులుగా భావించి వారి ఆరోగ్య స్థితిగతులను ఆశాకారకర్తలు ఎప్పటికప్పుడు తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డెంటల్ డాక్టర్ కులశేఖర్, సిహెచ్ఒ అన్నపూర్ణ, పిహెచ్ఎన్ సరస్వతమ్మ, సూపర్వైజర్లు వెంకట రమణయ్య, స్టాఫ్‌నర్సులు, హెల్త్ కార్యదర్శులు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

తెగిన రోడ్లకు మరమ్మతులు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కర్నూలు, నంద్యాల జిల్లాల్లో రోడ్లు తెగి ప్రయాణ ,రవాణా సౌకర్యాలకు ఇబ్బందిగా ఉన్న ప్రదేశాలను సందర్శించి వెంటనే మరమ్మతులు చేయించి ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా చేశామని ఆర్అండ్‌బి ఎస్ఇ ఆర్.నాగరాజు మంగళవారం ప్రజాశక్తికి తెలిపారు. అందులో ప్రధానంగా వరదల వల్ల కర్నూలు టు ఉల్చాల రోడ్డు 9వ కిలోమీటర్ వద్ద, తుగ్గలి ,పెండేకల్ 1/2-4 ఆర్ఎస్ రోడ్డు, ఓర్వకల్లు టు మిడ్తూర్ వద్ద రోడ్డు వరదకు అర కిలోమీటర్ కోతకు గురైందన్నారు. వీటిని వెంటనే యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేయించి రవాణా సౌకర్యాలకు అంతరాయం లేకుండా చేశామని ఆయన తెలిపారు. కర్నూలు మెడికల్ కళాశాల వద్ద మెడికల్ కళాశాల విద్యార్థినీ ఆర్టీసీ బస్సు ఢీకొని మృతి చెందడంతో అక్కడ స్పీడ్ బ్రేకర్ కూడా ఏర్పాటు చేశామని తెలిపారు.

రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలి

- డిసిసి అధ్యక్షులు బాబురావు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలని డిసిసి అధ్యక్షుడు కె.బాబురావు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీని ఆదరించి ఓట్లు వేసిన ఓటరు మహాశయులకు కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో బాబురావు మాట్లాడుతూ నూతనంగా ఏర్పడుతున్న తెలుగుదేశం ప్రభుత్వానికి ముఖ్యమంత్రి కాబోతున్న చంద్రబాబు నాయుడుకు జిల్లా కాంగ్రెస్ పార్టీ తరపున అభినందనలు తెలుపుతున్నా మన్నారు. అదేవిధంగా తెలుగుదేశం ప్రభుత్వం జిల్లాలో ఉన్న గుండ్రేవుల, వేదవతి, ఆర్ డిఎస్, గురు రాఘవేంద్ర లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటీకరణను రద్దు చేయాలన్నారు. టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు త్వరగా పంపిణీ చేయాలన్నారు. ఈ సమావేశంలో డిసిసి కోఆర్డినేషన్ కమిటీ చైర్మన్ అనంతరత్నం డిసిసి ప్రధాన కార్యదర్శి సయ్యద్ నవీద్, ఎస్సీ సెల్ జిల్లా చైర్మన్ ఈ లాజరస్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డిసిసి అధ్యక్షులు బాబురావు

మెగా డిఎస్‌సిపై తొలి సంతకం పెట్టాలి

- కొత్త ప్రభుత్వానికి డివైఎఫ్ఐ సూచన

ప్రజాశక్తి కర్నూలు కార్పొరేషన్

25 వేల పోస్టులతో మెగా డిఎస్‌పై కొత్తముఖ్యమంత్రి మొదటి సంతకం చేయాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వై.నగేష్ కోరారు. మంగళవారం కర్నూలు జిల్లా కార్యాలయంలో జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయబోతున్న నారా చంద్రబాబు నాయుడుకు డివైఎఫ్ఐ జిల్లా కమిటీ శుభాకాంక్షలు తెలిపింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానంగా నిరుద్యోగులకు ఇచ్చిన మాట ప్రకారం మొదటి సంతకం 25 వేల పోస్టులతో మెగా డిఎస్‌సిపై పెట్టాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నగేష్, జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర, నగర కార్యదర్శి హుస్సేన్ బాషలు కోరారు. 20 లక్షల ఉద్యోగాలు ఇచ్చేవరకు నిరుద్యోగులందరికీ నిరుద్యోగ భృతి ఈఏడాది జులై నుండి ఇవ్వాలని కోరారు. రాష్ట్రం అభివద్ధి చెందాలంటే ఇది మంచి అవకాశమని, రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన, ముఖ్యంగా కడప ఉక్కు కర్మాగారం నిర్మాణం, కర్నూలు రైల్వే వ్యాగన్ నిర్మాణం వేగవంతంగా పూర్తి చేయడం కోసం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని సూచించారు. గత ప్రభుత్వాలు నిరుద్యోగులను పట్టించుకోకపోవడం, నియంతృత్వంగా వ్యవహరించడం వల్లే తగిన మూల్యం చెల్లించుకోవలసి వచ్చిందని పేర్కొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డివైఎఫ్ఐ నాయకులు



ఆశాల తరుపున సిహెచ్ఒతో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు మోహన్

సి బెళగల్‌లో 'ఆశాలపై సిహెచ్ఒ చిందులు'

ప్రజాశక్తి-సి బెళగల్

సి బెళగల్ లోని 24 గంటల ఆసుపత్రిలో ఆశాలపై సిహెచ్ఒ ఉమా మహేశ్వరమ్మ మంగళవారం చిందులు వేసిన సంఘటన వెలుగులోకి వచ్చింది. ఇదే మండలంలోగల ఆశాలపై వైద్యాధికారి-1 విధుల్లో వేధింపులు పర్వం నెలకొందని, నూతన విధానాల మాటున వేతనాలలో కోతలు విధిస్తున్నారనే విషయం తెలిసి సిఐటియు నాయకులు మోహన్ వైద్యాధికారి - 1 తో మంగళవారం చర్చలు జరిపారు. ఇందులో సిహెచ్ఒ కూడా భాగమని తెలియడంతో పక్క గదిలో ఉన్న సిహెచ్ఒ మహేశ్వరమ్మ ఇది విని వైద్యధికారిణి గదిలోకి అమాంతం వచ్చి చిందులు వేశారు. ఈ ఆసుపత్రిలో వైద్యాధికారులు కూడా నా తర్వాతేనని నాతో చర్చలు చేయకుండా నా అనుమతి లేకుండా ఇక్కడ మాట్లాడేది ఎవరంటూ దుయ్యబట్టారు. నేను చెప్పినట్టు వినకపోతే ఇక్కడి ఆశాలు చాలా కోల్పోవాల్సిందేనని హెచ్చరించారు. కింద నుండి పై స్థాయి వరకు నన్ను అడిగేవారు లేరని ఆధిపత్యాన్ని బలప్రదర్శన చేశారు. నాయకులు కళ్ళేదుట ఈ సాహసం చేయడంతో ఆశాలపై నియంత్రత్వం యథేచ్ఛగా ఉన్నట్లు గుర్తించిన సిఐటియు నాయకులు మోహన్ మాట్లాడుతూ సిహెచ్ఒ ఈ సంఘటనపై తీరు మార్చుకోవాలని, లేదంటే ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్తామని మీడియాకు తెలిపారు.

బీడి ప్యాకర్లకు గ్రాడ్యుటీ పంపిణీ

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్



బీడీ ప్యాకర్‌కు చెక్కును ఇస్తున్న రవి

బావుట బీడీ ఫ్యాక్టరీలో బీడీ ప్యాకర్ గత 20 యేళ్ల నుంచి పనిచేస్తున్న బీడీ ప్యాకర్ పి.మిన్నల్లకు గ్రాడ్యుటీ రూ.30వేల ఎసిఎల్ సాంబశివ ఆధ్వర్యంలో మంగళవారం పంపిణీ చేశారు. బావుట బీడీ ఫ్యాక్టరీ యజమాన్యం 20 యేళ్లుగా ఫ్యాక్టరీ కార్మికులకు నష్ట పరిహారం ఇవ్వకుండా అన్నదమ్ములు భాగస్తులుగా విడిపోయారు. బీడీ ప్యాకర్ల న్యాయవాది వి.రవికుమార్, ఇ.మధుసూదన్‌రావు జె.ప్రభాకర్‌ను ఆశ్రయించారు. కమిషనర్ దగ్గర పిజి. కేసు నెంబర్ 1/2023, నమోదు చేశారు. పలు దఫాలుగా కేసు విచారణ జరిగి చివరకు యాజమాన్యం గ్రాడ్యుటీ రూ.30 వేలు ఇవ్వడానికి అంగీకరించింది. బీడీప్యాకర్ మిన్నల్ల సంతోషం వ్యక్తం చేస్తూ ఎసిఎల్‌కు ధన్యవాదాలు తెలిపారు. యాజమాన్యం తరపున న్యాయవాది దౌలత్, మేనేజర్ అమీన్ పాల్గొన్నారు.

వేసవి విజ్ఞాన శిబిరం విజయవంతం

1

10వ తరగతి విద్యార్థులకు అభినందన

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

వేసవి విజ్ఞాన శిబిరం విజయవంతమైందని,విద్యార్థులను, నిర్వహకులను సుందరయ్య స్ఫూర్తికేంద్రం వ్యవస్థాపకులు కె.ప్రభాకర్‌రెడ్డి అభినిందించారు. వేసవి విజ్ఞాన శిబిరం ముగింపు సందర్భంగా 10 వతరగతిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సోమవారం రాత్రి సుందరయ్య స్ఫూర్తి కేంద్రం, కర్నూలు చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వికాస్ విద్యానికేతన్ స్కూలులో అభినందన సభ నిర్వహించారు. మే 18 నుండి జూన్ 10 వరకు కర్నూలు చిల్డ్రన్స్ క్లబ్ నిర్వహించిన వేసవి విజ్ఞాన శిబిరానికి 51 మందివిద్యార్థులు హాజరయ్యారని తెలిపారు. ప్రతి రోజు డ్రాయింగ్ కథలు, పాటలు, లెక్కలు, తెలుగు సామెతలు, కోలాటం వంటి వాటితో విజ్ఞానశిబిరంలో ఆనందాల హరివిల్లుగా గడిపారన్నారు. మధ్యలో సైన్సు పార్క్‌ను సందర్శించి అనేక విషయాలు తెలుసుకొన్నారన్నారు. సి.క్యాంప్ కార్పొరేషన్ ఉన్నతపాఠశాల, ఎంహెచ్.అప్పా హైస్కూల్, కాకతీయస్కూల్ , ఆర్ఆర్.స్కూల్, రామకృష్ణ స్కూల్, వికాస్ విద్యనికేతన్‌లో 10వ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులు యూనుస్, లావణ్య, మహిర ,రుక్సాన, గురు, శ్రావణి, సి.పవన్, ఎం.సాయి, సుమమలత, సి.అనూష, టి.నందిని, సి.లిఖిత, ఏ. త్రివేణి, జయంత్ మాధవ్‌లను కె. ప్రభాకర్ రెడ్డి, మహిళా రైతు అర్జఉషా, కంటి వైద్య నిపుణులు డాక్టర్ బి.స్వాతి, ప్రజానాట్య మండలి జిల్లా అధ్యక్షులు ఎంపి.బస్వరాజ్, కర్నూలు చిల్డ్రన్స్ క్లబ్ కన్వీనర్ ఎస్.ఉమాదేవి, అడ్వకేట్ ఎస్.లక్ష్మణ్, 12 మంది విద్యార్థిని విద్యార్థులను, వారి తల్లిదండ్రులను శాలువాతో సత్కరించారు. చిల్డ్రన్స్ క్లబ్ కన్వీనర్ ఉమాదేవి అధ్యక్షతన జరిగిన సభలో కె.ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ లక్ష్మీనగర్‌లో వరుసగా మూడేళ్ల నుండి ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. సుందరయ్య అందరికీ ఆదర్శమని, ప్రజలకోసం ఆయన చేసిన సేవలను గుర్తు చేస్తూ స్ఫూర్తి కేంద్రం, చిల్డ్రన్స్ క్లబ్ ఎలాంటి స్వార్థం లేకుండా ప్రజలకు నిస్వార్థంగా సేవచేయటమే లక్ష్యం ఉంటూ కార్యక్రమాలు నిర్వహించిన లక్ష్మీనగర్ నిర్వాహకులను అభినందించారు. మహిళా రైతు అర్జఉషా మాట్లాడుతూ పిల్లల వికాసానికి, చిల్డ్రన్స్ క్లబ్ తోడ్పడటం వారిని వేసవికాలం సెలవుల్లో అనేక విషయాలు వివరిస్తూ మంచి మార్గం వైపు ప్రయాణించటానికి కృషి చేయడం అభినందనీయమన్నారు. నా వంతు కర్తవ్యంగా సహాయ సహకారాలు ఉంటాయన్నారు. డాక్టర్ బి.స్వాతి మాట్లాడుతూ నావంతు కర్తవ్యంగా సమ్మర్ క్యాంప్‌లో పాల్గొన్న వారందరికీ ఉచిత వైద్య పరీక్షలు అందిస్తామన్నారు. అడ్వకేట్ లక్ష్మణ్, ఇ.తాండ్రపాడు సర్పంచి బాలపీరా, వృత్తి దారుల సంఘం కార్యదర్శి శేషాద్రి, శ్రీరాములు, మెడికల్‌రెప్ సురేష్ ,శ్రీనివాస్‌రెడ్డి రిసోర్స్ పర్సన్ వనజ, జి.పద్మజ ,పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు. చిన్నారులు వేసిన ఊరు పల్లెటూరు, పర్యావరణంపైన వేసిన స్క్రిప్ట్ తదితర సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. 150 మంది పాల్గొన్నారు. గత సంవత్సరం సమ్మర్ క్యాంపులో పాల్గొని పాసైన హాసిని, సుశాంత్, చరణ్‌ను సన్మానించారు. కర్నూలు సిటీ ప్రయివేట్ పాఠశాలల అసోషియేషన్ అధ్యక్షులు బి.యుగంధర్ పాల్గొన్నారు.



ముగింపు సభలో మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి , వేదికపై డాక్టర్ స్వాతి తదితరులు



10వ తరగతి విద్యార్థిని అభినందిస్తున్న ప్రభాకర్‌రెడ్డి

ఎపి ఇఎపిసెట్ ఇంజనీరింగులో శ్రీ చైతన్యదే అగ్రస్థానం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఎపి ఇఎపిసెట్ 2024 ఫలితాలలో కర్నూలు శ్రీ చైతన్య విద్యార్థులు తమ ప్రతిభతో అగ్రస్థానంలో నిలిచారు. ఇంజనీరింగ్ విభాగంలో పి.ప్రనీత్ రెడ్డి 188వ ర్యాంకుతో కర్నూలు జిల్లాలో అగ్రస్థానం కైవసం చేసుకున్నాడని శ్రీ చైతన్య కళాశాలల ఎజిఎం.మురళీకృష్ణ తెలిపారు. అగ్రికల్చరల్, ఫార్మసీ విభాగంలో తమ విద్యార్థి పి.ఇమామ్ ఖాసీంబీ 753వ ర్యాంకు, ఎప్సెట్‌లో 2000ల లోపు 4 ర్యాంకులు, 5000 లోపు 17 ర్యాంకులు, 10000 లలోపు 64 ర్యాంకులు సాధించినట్లు తెలిపారు. తమ సంస్థనుంచి అనేక మంది విద్యార్థులు మంచి ర్యాంకులు సాధించారని తెలిపారు. అత్యుత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులకు ఏర్పాటు చేసిన అభినందన సభలో డీన్ సరళ , డీన్ బాలాజీ, అధ్యాపక బృందం పాల్గొన్నారు. ఈ ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను వారి తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను కళాశాలలో జరిగిన అభినందన సభలో ప్రశంసించారు.



ర్యాంకులు సాధించిన విద్యార్థులతో డీన్‌లు, అధ్యాపకులు

చంద్రబాబును కలిసిన తుగ్గలి నాగేంద్ర

ప్రజాశక్తి- తుగ్గలి



టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడును టిడిపి రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి, శాలివాహన సంఘం రాష్ట్ర అధ్యక్షులు తుగ్గలి నాగేంద్ర మంగళవారం చంద్రబాబు నాయుడు నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. గతంలో పత్తికొండకు వచ్చిన సం దర్భంగా నాగేంద్ర చంద్రబాబును కలిశారు. టిడిపి ప్రభుత్వం వస్తే సముచిత న్యాయం చేస్తానని మాట ఇచ్చారని ఆయన అనుచరులు అంటున్నారు. అందులో భాగంగానే నాగేంద్ర అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ గెలుపునకు కృషి చేశారు. టిడిపి అధికారంలోకి రావడంతో చంద్రబాబు నాయుడు నాగేంద్రకు ఎమ్మెల్సీ, శాలివాహన కార్పొరేషన్ చైర్మన్ ఏదో ఒక పదవి వస్తుందని ఆయన అనుచరులు చెప్పుకుంటున్నారు. ఈ సందర్భంగా తుగ్గలి నాగేంద్ర మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు ఆశీస్సులు తమకు మెండుగా ఉన్నాయని, పార్టీ కోసం అహర్నిశలు కష్టపడతానని తెలిపారు. టిడిపిలో కష్టపడే ప్రతి నాయకునికి, కార్యకర్తకు చంద్రబాబు ఆశీస్సులు మెండుగా ఉంటాయన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

13 నుంచి లవ్‌బాలి దర్గా ఉర్సు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరంలోని లవ్ బాలి దర్గా 395 ఉర్సు మహోత్సవం ఈనెల 13, 14, 15తేదీలలో నిర్వహిస్తున్నట్లు దర్గా పీఠాధిపతి హుస్సేనీ పీర్ సాహెబ్ ఒక ప్రకటనలో తెలిపారు. 13న రాత్రి 10 గంటలకు తరీమన్ ఖిబతి ముషాయిరా, 14 ఉదయం గుసులే షరీఫ్, సాయంత్రం హల్కే జికర్, వలి అల్లా గొప్పతనం పై ఉపన్యాస కార్యక్రమం ఉంటుందన్నారు. అనంతరం పీఠాధిపతి హుస్సేనీ పీర్ సాహెబ్ ఇంటి నుండి గంధం బయలుదేరి పట్టణ వీధులలో గొప్ప ఊరేగింపు శిష్యబృందంతో గంధం దర్గాకు చేరుతుంది. 15న సాయంత్రం ఖురాన్ గ్రంథ పఠనం, ఫాతిహా దువా ఉంటుందని తెలిపారు. ఈ ఉత్సవాల్లో ఆత్మీయ ప్రేమాభిమానాలు, శిష్యులు అధిక సంఖ్యలో పాల్గొని, సద్గురు జ్ఞాన ప్రసాదాన్ని కృప, ఆశీస్సులను పొందాలని హజరత్ డాక్టర్. సయ్యద్ షా హాషిం ఆరిఫ్ బాద్షా ఖాదరి అల్ హైదరి కోరారు.

14న జర్నలిస్టులకు ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్ : ఈ నెల 14న(శుక్రవారం) జర్నలిస్టులకు వారి కుటుంబ సభ్యులకు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నామని దానికి సంబంధించిన కరపత్రాలను కెవి సుబ్బారెడ్డి, కెజి.గంగాధర్ రెడ్డి మంగళవారం విడుదల చేశారు. షుగర్, బిపి, ఇసిజి, కళ్లద్దాల పంపిణీ ఉచిత వైద్య శిబిరంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కుటుంబ యాజమాని ఆరోగ్యం కుంటుపడితే ఆ కుటుంబం అల్లకల్లోలం అవుతుందని, కుటుంబానికి సంపాదనకు ఆరోగ్యమే ప్రదానమని కెవి సుబ్బారెడ్డి ఇంజనీరింగ్ విద్యాసంస్థల అధినేత కెవి సుబ్బారెడ్డి, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గంగాధర్ రెడ్డి అన్నారు. ఇసిజి, బిపి, షుగర్, కళ్ల పరీక్షలను ఉచితంగా పరీక్షిస్తారని తెలిపారు. ఫొటో వీడియో జర్నలిస్ట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు మీసాల రామస్వామి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఎయిడ్స్ రోగుల పట్ల వివక్ష చూపితే చర్యలు

- ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీరాములు

ప్రజాశక్తి - ఆదోని



మాట్లాడుతున్న సూపరింటెండెంట్ శ్రీరాములు

ఇంట్లో, పనిచేసే చోట, సమాజంలో హెచ్ఐవి, ఎయిడ్స్ రోగుల పట్ల వివక్ష చూపితే హెచ్ఐవి, ఎయిడ్స్ యాక్ట్ 2017 ప్రకారం చర్యలుంటాయని ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ డి.శ్రీరాములు హెచ్చరించారు. మంగళవారం ఇంటర్నేషనల్ కాండిల్ లైట్ మెమోరియల్ డే సందర్భంగా ఆదోని ప్రభుత్వాస్పత్రిలోని ఎఆర్‌టి సెంటర్‌లో ఎన్ఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు సుధారాణి అధ్యక్షతన కేర్ సపోర్ట్ సెంటర్ ఆధ్వర్యంలో దాతలు, పారిశ్రామిక వేత్త గౌరి వెంకటరామిరెడ్డి హెచ్ఐవి, ఎయిడ్స్‌తో జీవిస్తున్న 25 మందికి పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బీపీ, షుగర్, టీబీ కంటే హెచ్ఐవి, ఎయిడ్స్ కొంత మేలని తెలిపారు. వారు కూడా రోజూ మందులు వాడాలని, జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎటువంటి ఆహారమైనా ఎయిడ్స్ వారు తీసుకోవచ్చున్నారు. చిరు ధాన్యాలు జొన్నలు, సద్దలు, రాగులు, ఆకు కూరలు, సీజనల్ పండ్లు తీసుకోవడంతోపాటు వ్యాయామం చేయాలన్నారు. ఎఆర్‌టి నోడల్ ఆఫీసర్ డాక్టర్ జె.జగదీష్, షేరే ఇండియా ప్రోగ్రామ్ ఆఫీసర్ కె.రాజ్‌కుమార్, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు కె.భార్గవి, కె.సరిత, డి.పుష్పావతి, ఎల్‌డబ్ల్యుఎస్, డిఆర్‌పి, ఎఆర్‌టి, సిఎస్‌సి సిబ్బంది పాల్గొన్నారు.

అధ్వానంగా రోడ్లు

- బాగు చేయండి.. సారు..!

- వాహనదారుల విజ్ఞప్తి

ప్రజాశక్తి - ఆదోని

చిన్నపాటి వర్షం వచ్చినా గుంతల్లో నీరు నిలిచి డీఎస్పీ బంగ్లా రోడ్డు రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఈ రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు. పట్టణంలోని ఎన్‌టిఆర్ కూడలి నుంచి ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, డీఎస్పీ బంగ్లా మీదుగా రైల్వే ట్రాక్ మీదుగా జగనన్న కాలనీకి వెళ్లే రహదారి గుంతల మయంగా మారింది. రూ.కోటి వ్యయంతో ఎన్‌టిఆర్ కూడలి నుంచి ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల వరకు బిటి రోడ్డు నిర్మించారు. అక్కడి నుంచి రైల్వే ట్రాక్ వరకు రోడ్డు వేయకుండా మధ్యలోనే పనులు నిలపడం వల్ల అసంపూర్తిగా మారింది. ఆ రోడ్డు గుండా రైల్వే గూడ్స్ షెడ్, జగనన్న కాలనీ నిర్మాణానికి మెటీరియల్ తరలింపు ఇతరత్రా నిమిత్తం భారీ వాహనాలు వెళ్తున్నాయి.



గుంతలమయంగా మారిన రోడ్డు

అధ్వానంగా రోడ్డు

డీఎస్పీ బంగ్లా నుంచి రైల్వే ట్రాక్ వరకు రోడ్డు గుంతలమయంగా మారింది. ఎరుకలి కాలనీ వద్ద గుంత ప్రమాదకరంగా మారింది. చిన్నపాటి వర్షం వచ్చినా ఆ గుంతలో నీరు నిలిచి ఎక్కువ కాలం ఉంటుంది. రోడ్డు ఇరుకుగా ఉండడం వల్ల ఎదురుగా వచ్చే వాహనాలను తప్పించడం, దారి వదలే నేపథ్యంలో అక్కడ పరిస్థితులు తెలియని వారు గుంతల్లో ఇరుక్కొని ఇబ్బందులు పడిన సందర్భాలు ఉన్నాయి. జగనన్న కాలనీ నిర్మాణం కోసం నిత్యం వాహనాలు నిర్మాణ సామగ్రి, మెటీరియల్‌ను తీసుకెళ్తుంటాయి. కనీసం ఒక్క ట్రిప్ గ్రావెల్ కూడా ఆ గుంతల్లో వేయని పరిస్థితి ఉంది. రోడ్డు బాగు చేయాలని అప్పటి ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి దృష్టికి కాలనీవాసులు తీసుకువెళ్లినా చర్యలు తీసుకోలేదని విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా ఆ రోడ్డులో గ్రావెల్‌తోనైనా గుంతలు పూడ్చి రాకపోకలకు అనుకూలంగా చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలి

- కృష్ణమూర్తి, సిపిఎం పట్టణ నాయకులు



ఆదోనిలో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంది. కల్లుబావి, శంకర్ నగర్, ఢణాపురం, క్రాంతి నగర్‌కు వెళ్లేవారు రైల్వే గేటు రోడ్డు గుండా రాకపోకలు సాగిస్తున్నారు. రోడ్డు గుంతలమయంగా ఉండడం వల్ల అదుపుతప్పి కిందపడిన సందర్భాలు కూడా ఉన్నాయి. రాకపోకలు సాగించేందుకు కనీసం గ్రావెల్‌తోనైనా గుంతలు పూడ్చి చదును చేయాలి. రోడ్డు ఇరుకుగా ఉండడం వల్ల ఎదురుగా భారీ వాహనం వస్తే ఎటు వెళ్లాలో తెలియని పరిస్థితి. అధికారులు ఆ రోడ్డుకు మరమ్మతులు పనులు చేపట్టాలి. లేకపోతే స్థానికులతో కలిసి ఆందోళన చేస్తాం.

చైతన్యంతోనే బలహీనుల బతుకు మార్పు

- ప్రతి ఇంట్లో చైతన్య జ్యోతిని వెలిగించండి

- కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆనంద్ బాబు

ప్రజాశక్తి - మంత్రాలయం

దళిత వాడల్లోని బలహీన వర్గాల జీవితాల్లో మార్పు కోసం ప్రతి ఇంట్లో చైతన్య జ్యోతిని వెలిగించాలని జిల్లా ప్రధాన కార్యదర్శి ఎమ్‌డి.ఆనంద్‌బాబు కోరారు. మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో సమావేశం నిర్వహించారు. కెవిపిఎస్ మండల ఉపాధ్యక్షులు డి.అంజి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా ఆనంద్ బాబు, కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు హెచ్.జయరాజు మాట్లాడారు. ముందుగా రాష్ట్రంలో ఏర్పడుతున్న నూతన ప్రభుత్వానికి స్వాగతం పలికారు. తరతరాలుగా హక్కులకు దూరంగా ఉంచుతూ, అభివృద్ధి లేమితో జీవిస్తున్న అణగారిన దళితుల బతుకు మార్పు కోసం నూతన ప్రభుత్వమైనా దృష్టి సారించాలని కోరారు. ప్రజాస్వామ్య దేశంలో గెలుపోటములు సహజమన్నారు. కానీ మండలంలోని కొన్ని గ్రామాల్లో గెలిచినా, ఓడినా రాజకీయ పార్టీల నాయకులు దళితులు తమకు ఓటేయలేదంటూ దళితులపై దౌర్జన్యాలకు, బెదిరింపులకు పాల్పడుతున్నట్లు తెలిసిందన్నారు. అలాంటి అసాంఘిక శక్తులపై పోలీసులు అట్రాసిటి కేసులు నమోదు చేసి దళితులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. ఓటు అనేది రాజ్యాంగం కల్పించిన ఆయుధమని, అది ఎవరికి వేయాలనేది ఓటరు నిర్ణయించుకుంటారని తెలిపారు. పార్టీలేవైనా, ప్రభుత్వం ఏదైనా సమస్యలు పరిష్కారం కావాలంటే చైతన్యంతో ప్రశ్నించాలని కోరారు. అనంతరం కెవిపిఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులుగా హెచ్‌సి.ఈరన్న, డి.అంజిని ఏకగ్రీవంగా ఎన్నికున్నారు. మండల ఉపాధ్యక్ష, సహాయ కార్యదర్శులుగా సురేష్, మారెప్ప, దేవ సహాయం, దేవదానం, నరసన్న, కమిటీ సభ్యులుగా ప్రకాశం, అబ్రహాం, ఇసాక్, అంజినయ్యతో పాటు మరో 10 మందిని ఎన్నుకున్నారు.



మాట్లాడుతున్న ఆనంద్ బాబు

ఆర్‌టిసి ఉద్యోగులపై సస్పెన్షన్ ఎత్తేయాలి

- ఎస్‌డబ్ల్యుఎఫ్, సిఐటియు నాయకులు

ప్రజాశక్తి - ఆదోని

ఎన్నికల కోడ్ పేరుతో ఆర్‌టిసి ఉద్యోగులను, కార్మికులపై విధించిన అక్రమ సస్పెన్షన్ ఎత్తివేయాలని ఎస్‌డబ్ల్యుఎఫ్ జిల్లా నాయకులు అజీమ్ ఖాన్, సిఐటియు పట్టణ అధ్యక్షులు తిప్పన, నాయకుల కృష్ణమూర్తి, డిపో కార్యదర్శి రవి డిమాండ్ చేశారు. మంగళవారం ఆదోని ఆర్‌టిసి డిపో ముందు డిపో అధ్యక్షులు పివై.ప్రసాద్ అధ్యక్షతన నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఎన్నికల కోడ్ ఉందని ఏలూరు జిల్లాలో ఆర్‌టిసి డిపోలో పని చేస్తున్న ఉద్యోగులు మీటింగులు నిర్వహించారని, వారిని సస్పెండ్ చేశారన్నారు. అది రాజకీయ పార్టీ మీటింగు కాదని, యూనియన్ మీటింగ్ అని తెలిపారు. రాష్ట్ర గౌరవ సలహాదారులు సుందరయ్యతోపాటు కొంత మంది ఆర్‌టిసి ఉద్యోగులను సస్పెన్షన్ చేయడం విచారకరమని అన్నారు. అధికారులు ఇప్పటికైనా విధుల్లోకి తీసుకోవాలని ఆర్‌టిసి అధికారులను, ఎన్నికల అధికారులను కోరారు.

గుండెపోటుతో మాజీ సర్పంచి మృతి

ప్రజాశక్తి - గోనెగండ్ల



గోనెగండ్ల మాజీ సర్పంచి తలారి ఈశ్వరమ్మ (72) మంగళవారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందారు. ఈశ్వరమ్మ 2001 నుంచి 2005 వరకు గోనెగండ్ల మేజర్ పంచాయతీ సర్పంచిగా సేవలందించారు. ఆమె భర్త టి.వాసుదేవ నాయుడు 1995లో గోనెగండ్ల సర్పంచిగా ఎన్నికైన వెంటనే హత్యకు గురి కావడం అప్పట్లో తీవ్ర సంచలనం సృష్టించింది. వీరికి ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. వీరి కుటుంబం మొదట్లో టిడిపిలో ఉండి ప్రస్తుతం వైసిపిలో కొనసాగుతోంది. వీరి చిన్న కుమారుడు టి.మురళీ నాయుడు వైసిపిలో క్రియాశీలకంగా ఉంటున్నారు. ఆయన భార్య టి.రమణికుమారి వైస్ ఎంపిపిగా ప్రస్తుతం కొనసాగుతున్నారు. ప్రజలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు ఈశ్వరమ్మ మృతదేహాన్ని సందర్శించి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలియజేశారు.

బెల్డోన సహకార సంఘం ఛైర్మన్ రాజీనామా

ప్రజాశక్తి - చిప్పగిరి



రాజీనామా పత్రం అందజేస్తున్న మల్లికార్జున

బెల్డోన ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఛైర్మన్‌గా ఉన్న ఉనేబాద్ మల్లికార్జున, కమిటీ సభ్యులు రంగస్వామి, రామాంజినప్ప తమ రాజీనామా లేఖలను ఆమోదించాలని సిఇఒ హరికృష్ణకు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఇప్పటివరకు వ్యవసాయ సహకార పరపతి సంఘానికి తాము సేవలు అందించామని, తమకు సహకారం అందించిన సహకార సంఘం సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ఇకనుంచి అనివార్య కారణాల వల్ల విధులకు హాజరు కాలేకపోతున్నామని చెప్పారు. తమ వల్ల రైతులకు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులూ కలుగకుండా రాజీనామాలు ఆమోదించాలని సంబంధిత అధికారులకు తెలిపారు. సిఇఒ హరికృష్ణ మాట్లాడుతూ... రాజీనామా లేఖలను సంబంధిత అధికారులకు పంపుతున్నట్లు తెలిపారు.

'పరిశుభ్రతతోనే ఆరోగ్యం'

ప్రజాశక్తి- దేవనకొండ



సమావేశంలో మాట్లాడుతున్న వైద్యాధికారులు

పరిసరాల పరిశుభ్రత తోనే ఆరోగ్యంగా ఉంటారని జిల్లా అసిస్టెంట్ మలేరియా నివారణాధికారి చంద్రశేఖర్, యూనిట్ అధికారి సాయిబాబా తెలిపారు. మంగళవారం మండలం లోని నెల్లిబండ గ్రామంలో మలేరియా కేసును గుర్తించారు. మలేరియా వ్యాధి వచ్చిన రంగస్వామి ఇంటి పరిసరాలు, గ్రామంలోని అపరిశుభ్రత ప్రాంతాల్లో మలేరియా డిడిటి మందును పిచికారి చేశారు. అదేవిధంగా గ్రామంలో మలేరియా మాసోత్సవం సందర్భంగా గ్రామస్తులకు సీజనల్ వ్యాధులు డెంగీ, మలేరియా, చికున్‌గున్యా, బోదకాలు, మెదడు వ్యాధి గురించి అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్ రంగస్వామి, సిహెచ్‌ఒ ఆరోగ్య భాగ్యలక్ష్మి, ఆరోగ్య, ఆశాలు పాల్గొన్నారు.

చంద్రబాబు అనుభవంతో

రాష్ట్రం ముందడుగు

- టిడిపి నాయకులు

ప్రజాశక్తి - చిప్పగిరి

చంద్రబాబు నాయుడు అనుభవంతో రాష్ట్రం ముందడుగు వేస్తుందని టిడిపి నాయకులు తెలిపారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తున్న నేపథ్యంలో ఆయన శుభాకాంక్షలు తెలుపుతున్నా మని టిడిపి మండల కన్వీనర్ లాయర్ షేక్షావలీ, టిడిపి సీనియర్ నాయకులు పాముల సన్నప్ప, తెలుగు యువత జిల్లా మాజీ అధ్యక్షులు మేకల రవి యాదవ్, టిడిపి సీనియర్ నాయకులు లక్ష్మీకాంత్ రెడ్డి తెలిపారు. మంగళవారం వారు మాట్లాడారు. చంద్రబాబు నాయుడు అనుభవంతో రాష్ట్రం అన్ని రంగాల్లోనూ ముందుకెళుతుందని, అందులో ఏమాత్రం సందేహం లేదని తెలిపారు. రాష్ట్రాన్ని జగన్మోహన్ రెడ్డి ఒక నియంతలాగా, ఏ ఒక్కరి మాట వినకుండా అన్ని రంగాల్లో వెనుకపడేలా చేశారని విమర్శించారు. రాష్ట్రంలో ప్రతి గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించడానికి చంద్రబాబు అనుభవం ఎంతో మేలు చేస్తుందని తెలిపారు. విజన్ ఉన్న నాయకుడు ఎవరంటే చంద్రబాబు నాయుడేనని ప్రజలందరికీ తెలుసన్నారు.





నీటికుంటలో కాలుజారి పడి బాలుడు మృతి

ప్రజాశక్తి - చిప్పగిరి

గ్రామ చివరన ఉన్న నీటి కుంటలో కాలుజారి పడి అఖిల్ (3) మృతి చెందిన సంఘటన మంగళవారం మండలంలోని నేమకల్లు పంచాయతీలోని మజరా గ్రామమైన సంగాలలో చోటు చేసుకుంది. గ్రామస్తులు, పోలీసుల వివరాల మేరకు... కురువ మహానంది, గాయత్రి దంపతులకు ఐదుగురు సంతానం. కాగా ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతి చెందిన అఖిల్ నాలుగో సంతానం. నీటి కుంట దూరంలోనే ఆడుకుంటూ ఉంటారని తల్లిదండ్రులు అనుకోవడంతో ఈ పొరపాటు జరిగినట్లు తెలిపారు. అఖిల్ మృతి చెందడంతో తల్లిదండ్రులు, బంధువులు శోకసంద్రంలో మునిగిపోయారు.



రోధిస్తున్న తల్లిదండ్రులు, బంధువులు

16న 'వాల్మీకి' ప్రతిభా పురస్కారాలు

ప్రజాశక్తి - ఆదోని

గతేడాది పదో తరగతిలో ప్రతిభ కనబరచిన వాల్మీకి విద్యార్థులకు వాల్మీకి మహర్షి ప్రతిభా పురస్కారాలు ఈనెల 16న ఆదోనిలోని శిల్పా సౌభాగ్య నగర్‌లోని జిఎస్ఆర్ హైస్కూలులో అందజేస్తున్నట్లు జిల్లా వాల్మీకి ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘం నాయకులు నరసయ్య, సత్యన్న, రమేష్ నాయుడు, సుధాకర్ బాబు, భీమరాజు తెలిపారు. మంగళవారం వారు ఆదోనిలో మాట్లాడారు. జిల్లా పరిషత్, పురపాలక ఉన్నత, ప్రభుత్వ పాఠశాలల వాల్మీకి విద్యార్థులు ఈనెల 14లోగా పేర్లను మార్కుల జాబితా, కుల ధ్రువీకరణ పత్రం సమర్పించి 9491869398, 9640718346 నెంబర్లకు ఫోన్ చేసి నమోదు చేసుకోవాలని కోరారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తత అవసరం

- డాక్టర్ వినోద్ కుమార్



మాట్లాడుతున్న అధికారులు

ప్రజాశక్తి - ఆదోని

సీజనల్ వ్యాధులు సోకకుండా ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్ వినోద్ కుమార్ సూచించారు. మంగళవారం ఆశా డే సందర్భంగా ఆదోనిలోని షరాఫ్ బజార్ యుపిహెచ్‌సిలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నీటిని కాచి వడబోసి తాగాలన్నారు. ఇంటి పరిసరాల్లో నీరు నిలువ ఉండకుండా చూసుకోవాలన్నారు. సూపర్‌వైజర్లు బాబు రావు, లలితమ్మ, మేరీ, జ్ఞానేశ్వరి, ఎఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

తాగునీటిని వృథా చేయొద్దు

- మున్సిపల్ ఛైర్మన్ శాంత

- నీటి సరఫరాపై కౌన్సిలర్లతో సమావేశం

ప్రజాశక్తి - ఆదోని

సూచించిన సమయం మేరకే తాగు నీరు వదలాలని, కొందరి నిర్లక్ష్యం కారణంగా కాలువల గుండా వృథా అవుతున్నాయని, పద్ధతి మార్చుకోకపోతే చర్యలు తీసుకుంటామని మున్సిపల్ ఛైర్మన్ శాంత, మున్సిపల్ ఇంజినీర్ వెంకట చలపతి రెడ్డి హెచ్చరించారు. మంగళవారం మున్సిపల్ కౌన్సిలర్లతో నీటి సరఫరాపై సమావేశం నిర్వహించారు. బసాపురం సమ్మర్ స్టోరేజీ ట్యాంకులో కేవలం 35 రోజులకు సరిపడ నీరు నిల్వ ఉందని, పొదుపుగా వాడుకోవాలని కోరారు. తుంగభద్ర దిగువ కాలువ ద్వారా నీరు సరఫరా కావాలంటే మరో 55 రోజులు సమయం ఉందని తుంగభద్ర డ్యాం అధికారులు తెలిపారని మున్సిపల్ ఇంజినీర్ వెంకట చలపతి రెడ్డి, అసిస్టెంట్ ఇంజినీర్ రాజశేఖర్ రెడ్డి వివరించారు. డ్యాంలో మన వాటా నీరు ఉందని, వాటిని వదలాలని 'రిక్వెస్ట్ లెటర్' పెట్టాలని కౌన్సిలర్ రఘునాథ్ రెడ్డి కోరారు. నీరు సమృద్ధిగా నిల్వ ఉంటే త్వరగా కాలువకు వదిలే అవకాశం ఉందని, లేకపోతే గడ్డు పరిస్థితి తప్పదని కౌన్సిలర్ బాలాజీ అధికారులకు తెలిపారు. కొందరు లైన్‌మేన్లు ఫోన్ చేసినా అందుబాటులో ఉండడం లేదని కౌన్సిలర్లు అధికారుల దృష్టికి తెచ్చారు. నీరు వదిలే ఉద్యోగులు పద్ధతి మార్చుకోవాలని, లేకపోతే చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. కౌన్సిల్ హాలులో కౌన్సిలర్ల భర్తలు, వారి బంధువులు సమావేశంలో పాల్గొనడం ఏమిటని మున్సిపల్ ఇంజినీర్ వెంకట చలపతి రెడ్డి దృష్టికి తీసుకురాగా నీటి సమస్య ఉందని ఛైర్మన్ దృష్టికి తెచ్చారని, అక్కడ స్థలం చాలక పోవడంతోనే కౌన్సిలర్లు సమావేశం నిర్వహించమే తప్ప ఎలాంటి అధికారిక సమావేశం కాదని ఆయన వివరణ ఇచ్చారు. మున్సిపల్ వైస్ ఛైర్మన్లు నరసింహులు, మహ్మద్ గౌస్, కౌన్సిలర్లు చలపతి, ఉస్మాన్, ఇంతియాజ్, సందీప్ రెడ్డి, రాజేశ్వర్ రెడ్డి, నాయకులు రామలింగేశ్వర యాదవ్, చంద్రశేఖర్ రెడ్డి, రాజేశ్వర్ రెడ్డి, వెంకటేష్, గోవిందు, రామకృష్ణ, కిషోర్ ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కౌన్సిలర్లు

బండగట్టు నీటిని సరఫరా చేయండి

- పైపులైన్ లీకేజీతో సరఫరాకు నోచని బండగట్టు నీరు

ప్రజాశక్తి- దేవనకొండ

మండలంలోని బండగట్టు రిజర్వాయర్ నుంచి సరఫరా అవుతున్న తాగునీరు నెల్లిబండ గ్రామ సమీపంలో పైపులైన్ లీకేజీ కావడంతో గత వారం రోజులుగా సరఫరా బంద్ కావడంతో వివిధ గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బండగట్టు రిజర్వాయర్ నుంచి మండలంలోని తెర్నేకల్, దేవనకొండ, వరిముక్కల, అలారుదిన్నె, వెలమకూరు, కుంకనూరు గ్రామాలకు పైపు లైన్ ద్వారా కుళాయిలకు తాగునీరు సరఫరా అవుతోంది. పైప్‌లైన్ లీకేజీతో తాగునీరు సరఫరాకు నోచుకోవడం లేదని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. సంబంధిత అధికారులు బండగట్టు తాగునీటి కాంట్రాక్టర్‌తో మరమ్మతులు చేపట్టి నీటిని సహక్రమంగా సరఫరా చేయించాలని కోరుతున్నారు.


'మోడల్' ప్రవేశ పరీక్ష ఫలితాలు విడుదల

- 13వ తేదీ ప్రవేశాలకు చివరి తేదీ

- ప్రిన్సిపల్ షాహినా పర్వీన్

ప్రజాశక్తి - గోనెగండ్ల

గోనెగండ్లలోని ఎపి మోడల్ పాఠశాల ప్రవేశ పరీక్ష ఫలితాల్లో ఎంపికైన విద్యార్థుల జాబితా, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి ఎంపికైన విద్యార్థుల జాబితా విడుదల చేసినట్లు పాఠశాల ప్రిన్సిపల్ షాహినా పర్వీన్ తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడారు. ఎంపికైన విద్యార్థులు వారి తల్లిదండ్రులతో తగిన ధ్రువపత్రాలతో పాఠశాల వద్ద హాజరై ప్రవేశాలు పొందాలని సూచించారు. ప్రవేశాలకు ఆఖరి తేదీ ఈనెల 13 అని, ఎంపికైన విద్యార్థులకు ఫోన్ ద్వారా గత వారంలోనే సమాచారం అందించామని తెలిపారు. 13లోపు ప్రవేశాలు పొందని వారి సీట్లు రద్దు చేస్తామని చెప్పారు. ఎంపికైన విద్యార్థులు ఉదయం 10 నుంచి 12.30 గంటల వరకు, మధ్యాహ్నం నుంచి 2 నుంచి 3.30 గంటల వరకు అడ్మిషన్లు పొందవచ్చున్నారు.



7, 8, 9వ తరగతుల ఖాళీ సీట్ల భర్తీకి దరఖాస్తులు

గోనెగండ్లలోని ఆదర్శ పాఠశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి 7వ తరగతి ఒక సీటు, 8వ తరగతి ఒక సీటు, 9వ తరగతి ఒక సీటు ఖాళీగా ఉన్నాయని ప్రిన్సిపల్ తెలిపారు. ఈ ఖాళీ సీట్ల భర్తీ కోసం అర్హులైన విద్యార్థులు ఓసీ, బీసీలు రూ.100, ఎస్సీ, ఎస్టీలు రూ.50 రుసుం చెల్లించి ఈనెల 14లోపు పాఠశాల వద్ద దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రవేశ పరీక్ష ఈనెల 15న ఆదర్శ పాఠశాలలో ఉదయం 10 నుంచి 12 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని అర్హులైన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

తిమ్మారెడ్డి ఆర్‌టిసి బస్టాండ్ దుర్గంధభరితం

ప్రజాశక్తి - ఆదోనిరూరల్

పట్టణంలోని తిమ్మారెడ్డి ఆర్‌టిసి బస్టాండ్ దుర్గంధభరితంగా మారుతోంది. బస్టాండ్ దుర్గంధభరితంగా మారి పలు రకాల వ్యాధులకు దోహదపడుతున్నట్లు పలువురు వాపోతున్నారు. ఆర్‌టిసి బస్టాండ్ రోగాలకు నిలయంగా మారి చెత్తాచెదారంతో నిండి ఉంది. బస్టాండ్ సమీపంలో ఉన్న మల, మూత్రశాల శిథిలావస్థకు చేరడం ప్రయాణికులకు పలు ఇబ్బందిగా మారుతున్నట్లు తెలిపారు. వచ్చిన వర్షానికి బురదమయంగా మారింది. ఈ బురదలో వృద్ధులు, పిల్లలు చాలాసార్లు జారిపడిన సందర్భాలు ఉన్నాయి. ఆర్‌టిసిలో పని చేస్తున్న కండక్టర్లు మల, మూత్రశాలలకు ఆరు బయటకు పోవాల్సిందే. మహిళా కండక్టర్ల పరిస్థితి చెప్పాల్సిన పరిస్థితి లేదు. సరైన మూత్రశాలలు, మురుగుదొడ్లు లేకపోవడంతో అటు ప్రయాణికులు, ఇటు సిబ్బంది చాలా ఇబ్బంది పడుతున్నారు. ఆర్‌టిసి బస్టాండ్ ఏర్పాటు చేసినప్పుడు మల, మూత్రశాలలు ఏర్పాటు చేసి ఒక వ్యక్తిని వాటి పరిరక్షణ చేసేందుకు గతంలో ఉంచినట్లు పలువురు చెప్పారు. ప్రస్తుతం మల, మూత్రశాలలో శిథిలావస్థకు చేరడమే కాకుండా అటువైపు వెళ్లాలంటే భయంకరంగా ఉన్నట్లు ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బస్టాండ్ ఆవరణంలో అద్దెకు గదులు ఇచ్చి వారి వద్ద నుంచి రూ.వేలకు వేలు బాడుగలు వసూలు చేస్తూ మల, మూత్రశాలలో ఏర్పాటుకు నోచుకోకపోవడం ఇబ్బంది పడుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



దుర్గంధ భరితమైన ఆర్‌టిసి బస్టాండ్ ఆవరణం

అక్రమ డొనేషన్లు వసూలు చేస్తున్న

పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

- విద్యార్థి సంఘాల నాయకులు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు రూరల్

అక్రమంగా డొనేషన్లు వసూలు చేస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయంలో ఎస్ఎఫ్ఐ, పిడిఎస్‌ఒ, ఆర్‌విఎఫ్, ఆర్‌యుఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో తహశీల్దార్ శేషారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు ఖాజా, సురేంద్ర, కృష్ణ, విజయ్, రఘునాథ్ మాట్లాడారు. పట్టణంలోని ప్రయివేట్, కార్పొరేట్ పాఠశాలల్లో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా విద్యార్థి తల్లిదండ్రుల నుంచి రూ.వేలకు వేలు ఫీజులు వసూలు చేస్తూ, అడ్మిషన్ ఫీజు పేరుతో డొనేషన్లు సైతం వసూలు చేస్తున్నారని తెలిపారు. అలాగే జిఒ నెంబర్ 1ని ఉల్లంఘించి పాఠశాలల్లోనే పుస్తకాలు, బ్యాగులు, షూస్ అమ్ముతూ పాఠశాలలను వ్యాపార కేంద్రంగా మార్చారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యాశాఖ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించి కార్పొరేట్ పాఠశాలలకు వత్తాసు పలుకుతున్నారని విమర్శించారు. ఇకనైనా విద్యాశాఖ అధికారులు స్పందించకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.



తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించండి

- అదనపు కమిషనర్‌కు ఎఐటియుసి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగర పాలక సంస్థ ప్రజాఆరోగ్య విభాగంలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కర్నూలు నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ పివి. రామలింగేశ్వర్ కు మంగళవారం ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.మునెప్ప వినతి పత్రాన్ని ఇచ్చారు. మునెప్ప మాట్లాడుతూ కర్నూలు నగరపాలక సంస్థలో పనిచేసే మున్సిపల్ పారిశుధ్య కార్మికుల దీర్ఘకాలంగా సమస్యలను ఎదుర్కొంటున్నారని, వాటిని మున్సిపల్ అధికారులు తక్షణమే పరిష్కరించాలన్నారు. కార్మికులు పనిముట్లు కొరతతో ఇబ్బందులు పడుతున్నారని, సకాలంలో కార్మికులకు పనిముట్లు ఇవ్వాలన్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో విధులలో పాల్గొన్న పారిశుధ్య కార్మికులకు ఎన్నికల భత్యం ఇవ్వాలన్నారు. 2024 సమ్మె కాలపు వేతనాలు తక్షణమే కార్మికులకు ఇప్పించాలన్నారు. అవుట్ సోర్సింగ్ కార్మికులకు యూనిఫామ్ బట్టలను తక్షణం ఇప్పించాలన్నారు. ఎపిజిఎల్ఐ బాండ్లు ,హెల్త్ కార్డులు, 2021 సంవత్సరం నుండి రావలసిన డిఎ అరియర్స్‌ను వెంటనే ఇప్పించాలన్నారు. పారిశుధ్య కార్మికులకు తమ ఆలు బిడ్డలతో ఆనందంగా గడిపేందుకు ఆదివారం రోజున సెలవు దినంగా ఇప్పించాలని మున్సిపల్ అధికారులను డిమాండ్ చేశారు. ఎఐటియుసి నగర కార్యదర్శి జి .చంద్రశేఖర్, ఎపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పులగం. మద్దిలేటి, ఎఐటియుసి డిప్యూటీ సెక్రెటరీ రామాంజనేయులు, కార్మికులు కృష్ణమూర్తి, వీరదాసు, మహేష్ లు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు